నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
17 వ
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
ఆదివారం,2 జూన్ 2024

ఏలూరు జిల్లాలో 97 శాతం పెన్షన్ల పంపిణీ

- రాష్ట్రంలో 3వ స్థానం : డిఆర్‌డీఏ పిడి విజయరాజు వెల్లడి

ఏలూరు,మేజర్ న్యూస్: ఏలూరు జిల్లాలో శనివారం రాత్రి 8.30 గంటల వరకు 97 శాతం పెన్షన్ల పంపిణీ జరిగిందని, 2,60,139 మందికి రూ.77.74 కోట్లు అందచేయడం జరిగిందని డిఆర్‌డీఏ పిడి ఆర్.విజయరాజు తెలిపారు. పెన్షన్ పంపిణీ నిమిత్తం రూ.80.32 కోట్లు విడుదల కాగా ఇంతవరకు రూ.77.74 కోట్లు పంపిణీ చేసి 97 శాతం పంపిణీ తో రాష్ట్రంలో 3వ స్థానంలో ఉంది. 97.9 శాతంతో శ్రీకాకుళం,97.02 శాతంతో విజయనగరం జిల్లాలు వున్నాయి. దివ్యాంగులు,తీవ్ర అనారోగ్యంతో లేవలేని స్థితిలో ఉన్నవారికి మంచం లేదా వీల్‌ఛైర్‌కు పరిమితమైన వారికి, సైనిక సంక్షేమ పింఛన్లు పొందుతున్న యుద్ధవీరుల వృద్ధ వితంతువులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటి వద్దనే పెన్షన్లు నగదు రూపంలో అందిస్తున్న సిబ్బంది జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు పెన్షన్ పంపిణీని డి ఆర్ డీ ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పరిశీలించారు.

ఎగ్జిట్ పోల్స్‌తో తికమక

కొన్ని వైఎస్సార్సీపీకి
- మరికొన్ని ఎన్డీఏ కూటమికి అనుకూలంగా వెల్లడి
- లోక్ సభ స్థానాల్లో టిడిపికి
ఆధిక్యం అని జాతీయ మీడియా సంస్థల సర్వే

ఏలూరు, సూర్య బ్యూరో : ఎగ్జిట్ పోల్స్ సర్వేలు శనివారం సాయంత్రం 6:30గంటలనుండిటీవీలలో ఊదరగొట్టాయి.మే 13వ తేదీన రాష్ట్రంలో పోలింగ్ జరగగా, ఈనెల 4వ తేదీన దేశంలోని పలు రాష్ట్రాల తో పాటు మన రాష్ట్రంలోనూ ఓట్ల లెక్కింపు జరగనుంది. దేశంలో ఆఖరి విడత ఎన్నికల పోలింగ్ 6 గంటలకు ముగియడంతో దేశంలోని అనేక రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలపైఎగ్జిట్‌పోల్స్‌సర్వేలువెలువడ్డాయి. ఆంధ్ర ప్రదేశ్లో జరిగిన పోలింగ్‌పై కొన్ని ఎగ్జిట్ పోల్స్ అధికార వైయస్సార్సీపీకి, మరికొన్ని ఎన్డీఏ కూటమి లోని తెలుగుదేశం, జనసేన,బిజెపికి పట్టం కట్టాయి. దీంతో ప్రజల్లో గందరగోళ వాతావరణం ఏర్పడింది. ఎవరికి వారే తమదే విజయం అంటూ పైకి ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ ఈ నెల నాలుగున జరిగే ఓట్ల లెక్కింపు వరకు ఉత్కంఠత తప్పని పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ వైఎస్ఆర్సిపి తమదే విజయం అంటూ, మళ్లీ ముఖ్యమంత్రిగాజగన్‌ప్రమాణస్వీకారం చేస్తారంటూ చెబుతుండగా, ఈసారి ఖచ్చితంగా తమదే విజయం అంటూ, చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి అవుతారంటూ,పవన్‌కళ్యాణ్,నారాలోకేష్ ఘన విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెడతారంటూఘంటాపదంగా చెబుతున్నారు. వైసీపీకి అనుకూలంగా చెప్పిన సర్వే సంస్థలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.కాగాలోక్ సభస్థానాల్లో ఎక్కువ మీడియా సంస్థలు

తెలుగుదేశం కూటమికే అనుకూలంగా ఎగ్జిట్ పోల్స్ ప్రకటించాయి. జాతీయ స్థాయిలో ఎన్డీఏ కూటమికే అన్ని ఎగ్జిట్ పోల్స్ మొగ్గు చూపాయి. కాంగ్రెస్ కూటమి అయిన ఇండియాకు తక్కువ స్థానాలు వస్తున్నట్లు తెలిపాయి తెలుగు మీడియా సంస్థలు మాత్రం పార్టీలు వారీగా విడిపోయి, ఎవరికి వారే తమ అనుకూల పార్టీ దే విజయంఅంటూ ఎగ్జిట్ పోల్స్ ప్రకటించాయి. ఈ విధంగా ప్రజల్లో తికమక వాతావరణం నెలకొంది.రాష్ట్రంలో గతంలో ఏ ఎన్నికల్లోనూ లేని విధంగా,ఏసర్వే సంస్థలకు నాడి అందనిపరిస్థితి ఈసారి నెలకొంది. మరో మూడు రోజులు,4 తేదీ వరకుఅసలు ఫలితాల కోసం గుండెదిటవు చేసుకొని క్షణక్షణం ఉత్కంటతతోఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- సుమారు 1000 మంది సిబ్బంది
-17,500 పోస్టల్ బ్యాలెట్లు

ఏలూరు,మేజర్ న్యూస్: జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల మేరకు ఓట్ల లెక్కింపు కేంద్రాలు సిద్ధం చేశామన్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించే సర్.సి.ఆర్.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో పటిష్టమైన బంధోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈవిఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ లకు ఏవిధమైన మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామని అదే రీతిలో కౌంటింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ ప్రక్రియ ఎంత ప్రశాంతవాతావరణంలో జరగడంతోపాటు ఓటర్ టర్నౌట్ కూడా పెరిగిందన్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల్లో 24/7 సిసి కెమేరా నిఘా ఉందన్నారు.జిల్లాలోని 7అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పార్లమెంట్, అసెంబ్లీ కలిసి ఓట్ల లెక్కింపుకు 28 టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఈవిఎంల ఓట్ల లెక్కింపు సుమారు 20 నిమిషాల సమయం పడుతుందని అంచనా వస్తున్నా మని అన్నారు. ఈ విధంగా 16 నుంచి 21 రౌండ్లలో ఆయా నియోజక వర్గాల ఓట్లలెక్కింపు ఉండవచ్చన్నారు.

జిల్లాలో సుమారు 17,500 పోస్టల్ బ్యాలెట్లను 3 రౌండ్లలో పూర్తిచేసేందుకు 3 టేబుల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. ఓట్ల లెక్కింపు కోసం సుమారు వెయ్యి మంది సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. ఈవిఎంలలో ఓట్ల లెక్కింపు మద్యాహ్నం 3 నుండి 4 గంటలలోపు పూర్తి కాగలదని అంచనా వేశామని అదే విధంగా పోస్టల్ బ్యాలెట్ తుది ఫలితాలు సాయంత్రం 5 – 6 గంటల మధ్య పూర్తి కావచ్చన్నారు. ప్రతి మండల కేంద్రంలో యంపిడివోలకు మేజిస్ట్రేరియల్ అధికారాలు ఇవ్వడం జరిగిందన్నారు.

ఖైదిలకు ఉచిత న్యాయ సహాయం
: ప్రధాన న్యాయమూర్తి

నర్సాపురం,మేజర్ న్యూస్: ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల ప్రధాన జిల్లా న్యాయమూర్తి, చైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సి.పురుషోత్తం కుమార్ శనివారంఉపకారాగారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి, నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగాఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు, ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. జైల్ ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, నర్సాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, ఒకటవ అధనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్,ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు,జైల్ సిబ్బంది,బార్ అసోసియేషన్ అధ్యక్షులు సి హెచ్ దానయ్య నాయుడు,కార్యదర్శి ఆర్.జి కుమార్,ప్యానల్ న్యాయవాదులు చిట్టి పద్మజ,శిరీష, శ్రీహరి, చాముండేశ్వరి, ఆనంద్ బాబు,పి.ఎల్.వి వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎగ్జిట్ పోల్స్ అన్నీ నిజాలు కావు
: దేశం నేత నాయుడు

నర్సాపురం,మేజర్ న్యూస్ : వివిధ సంస్థలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు శనివారం విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్ అన్ని నిజాలు కావని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం ఆయన సూర్య ప్రతినిధితో మాట్లాడారు. గతంలో జరిగిన ఎన్నికలలో కూడా అనేక సంస్థలు మావి నిజమైన ఎగ్జిట్ పోల్స్ అని చెప్పినప్పటికీ ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేసరికి సంబంధం లేకుండా ఉందని ఆయన అన్నారు. కొన్ని సంవత్సరాలు చేపట్టిన ఎగ్జిట్ పోల్స్ నిజమైన సందర్భాలు కూడా ఉన్నాయని నాయుడు అన్నారు. ప్రతి నియోజకవర్గానికి సుమారు రెండు లక్షల మంది ఓటర్లు ఉండగా నాలుగు నుండి 5వేల మంది దగ్గర శాంపుల్స్ సేకరించి వాటి ఆధారంగా ఎగ్జిట్ పోల్స్ విడుదల చేస్తారని అన్నారు. ఎన్నికల ముగిసిన అనంతరం ఈ సర్వే చేపడతారని నియోజకవర్గానికి 5వేల మంది దగ్గర శాంపిల్స్ తీసుకుని వాటి ఆధారంగా గెలుపు ఓటములను నిర్దేశస్తారని నాయుడు అన్నారు. ఈనెల 4న ఓట్ల లెక్కింపు అనంతరం ఎన్నికల సంఘం ఫలితాలు విడుదల చేస్తుందని అంతవరకు వేచి చూడవలసిన అవసరం ప్రజలందరికీ ఉంది అని నాయుడు అన్నారు.

హనుమాన్ మహా యజ్ఞంలో పాల్గొన్న టిడిపి నేత బడేటి చంటి

ఏలూరు,మేజర్న్యూస్: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక 2వ డివిజన్ బావిశెట్టి వారి పేట నందు వేయించేసియున్న శ్రీ కోదండ రామాలయం నందు జరుగుతున్న హనుమాన్ మహా యజ్ఞం మహోత్సవం కార్యక్రమానికి ఏలూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త మామిళ్ళపల్లి పార్థసారధి,వివిధ హోదాలలో ఉన్న తెలుగుదేశం–జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ పక్కాగా పూర్తి చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

భీమవరం,మేజర్ న్యూస్: జూన్ 4 విష్ణు ఇంజనీరింగ్ కళాశాల,ఎస్ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రాలను, మీడియా సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ శనివారం పరిశీలించారు. తొలుత విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని, మీడియా సెంటర్ ను పరిశీలించారు. మీడియా సెంటర్ లో హై స్పీడ్ ఇంటర్నెట్, వైఫై కనెక్టివిటీ, టెలివిజన్లు ఏర్పాటు తదితర అంశాలపై తగు సూచనలను సంబంధిత అధికారులకు జారీచేసారు. పోస్టల్ బ్యాలెట్ టేబుల్స్, సిట్టింగ్ ఏర్పాట్లును పరిశీలించి ఇబ్బంది లేని విధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎస్ఆర్ కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఉండి నియోజకవర్గం కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్యతో కలిసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ డివైసులు లోపలికి అనుమతించేది లేదని స్పష్టం

చేశారు. ఓట్ల లెక్కింపు అధికారులు, సిబ్బంది ఉదయం 5.30 గంటలకే ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య,జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు,ఎన్నికల సెక్షన్ పర్యవేక్షకులు చందన దుర్గాప్రసాద్,డిప్యూటీ తహసీల్దార్ మర్రాపు సన్యాసిరావుఉన్నారు.

ఎగ్జిట్ పోల్స్ పేరుతో అల్లర్లకు పాల్పడితే జైలుకే
- జిల్లా ఎస్‌పి మేరి ప్రశాంతి హెచ్చరిక

ఏలూరు,మేజర్ న్యూస్: ఎగ్జిట్ పోల్స్ పేరుతో ప్రజలు వివాదాలకు ,అల్లర్లకు పాల్పడితే జైలుకే అని ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికలు ఎగ్జిట్ పోల్స్,కౌంటింగ్ దృష్ట్యా గ్రామాల్లో వివాదాలు అల్లర్లకు లేకుండా శాంతి యుతంగా ఉండాలని పలు సూచనలు చేశారు. కౌంటింగ్ జూన్ 4వ తేదీ న నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్.144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్, ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించి నడుచుకోవాలని కోరారు. ఇతరులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదని, అనవసరపు గొడవలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి హెచ్చరించారు.

రైతుల సమస్యలపై అధికారులతో మాట్లాడిన చింతమనేని

పెదవేగి,మేజర్ న్యూస్: అటు ప్రభుత్వం, ఇటు విద్యుత్,పోలీస్ శాఖ అధికారుల ఉదాసీనత వల్ల రైతులు ఎన్నో అవస్థల పాలవుతున్నారని, తక్షణమే సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని పలు గ్రామాలనాయకులు కార్యకర్తలు, అభిమానులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల తమ పొలాల్లోని ట్రాన్స్ఫార్మర్లను దొంగలు ఎత్తు కెళ్ళారని, వాటిపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి కాపీలను విద్యుత్ శాఖ అధికారులకు అందించి రోజులు గడుస్తున్నా, ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయకుండా ఫైల్ అక్కడుంది, ఇక్కడుంది అంటూ తాత్సారం చేస్తున్నారని పలువురు రైతులు తెలిపారు. తన పొలంలో 25కెవి ట్రాన్స్ఫార్మర్ పోయిందని ఫిర్యాదు చేసి నెల గడుస్తున్నా కనీసం విద్యుత్ అధికారుల్లో స్పందన లేదని కొమ్మా.చింతయ్య అనే రైతు తెలిపారు. దీంతో రైతుల సమస్యలపై తక్షణమే స్పందించిన ఆయన జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. రైతుల పొలాల్లో దొంగలు పడి యధేచ్ఛగా ట్రాన్స్ఫార్మర్లు దొంగతనం చేస్తుంటే పోలీస్ శాఖ ఏమి చేస్తుందని

రైతుల సమస్యలపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడుతున్న చింతమనేని

ప్రశ్నించారు. పోలీస్ శాఖ నిర్లక్యం వల్ల ట్రాన్స్ఫార్మర్ల కొరత ఏర్పడి రైతులు ఇంతగా ఇబ్బందులు పడుతుంటే, ఆ ఘటనలపై పోలీస్ శాఖ వైఫల్యాలను ప్రస్తావిస్తూ విద్యుత్ శాఖ రాష్ట్ర డిజిపికి లేఖ రాయాలని చింతమనేని ప్రభాకర్ సూచించారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై సత్వరమే స్పందించిన చింతమనేని ప్రభాకర్ కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈవిఎంలు భద్రపరిచిన ప్రాంతంలో పరిశీలన చేసిన ఎస్‌పి

ఏలూరు,మేజర్న్యూస్: ఈవిఎంలు భద్రపరిచిన సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో క్షేత్రస్థాయి పరిశీలన చేసిన ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి స్ట్రాంగ్ రూమ్‌వద్ద కౌంటింగ్ జరిగే సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో పటిష్టంగా కొనసాగుతోన్న భద్రతతో పాటు ఆ ప్రాంగంణం లోపల, వెలుపల ఏర్పాట్లు గురించి వాహనాల పార్కింగ్, బందోబస్తు చర్యలను గురించిఅధికారులతోసమీక్షించారు. ఇంజనీరింగ్ కాలేజ్ ప్రాంగణాలలో పార్కింగ్ స్థలాలను పరిశీలించి మెరుగైన చర్యల కోసం అధికారులకు పలు సూచనలు చేశారు.

సి.ఆర్.రెడ్డి కాలేజిలోకి వెళ్లొచ్చేందుకు ఎంట్రీ,ఎగ్జిట్ దారులు మినహాయించి మిగితా మార్గాలేవీ లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పోటీ అభ్యర్థుల వాహనాల పార్కింగ్‌ను ఇంజనీరింగ్ కాలేజ్‌లోని ఆయా కౌంటింగ్ కేంద్రాల వద్దనున్న నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లో నిలుపుకునేలా. మిగితా కౌంటింగు ఏజెంట్ల వాహనాలను వారికి కేటాయించిన పార్కింగ్ స్థలాలలో ఏర్పాటు చేయమని సూచించారు.జిల్లాఎస్పీతో

పాటుఎస్పీ (ఎన్‌సి) సుప్రజా, అదనపు ఎస్పీ అడ్మిన్ జి.స్వరూపారాణి, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్,ఎస్.బి ఇన్స్పెక్టర్లు మల్లేశ్వరరావు ,ఆది ప్రసాద్, డి.ఎస్.పి ఈ శ్రీనివాసులు,3 టౌన్ ఇన్చార్జి ఇన్స్పెక్టర్ కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సూర్య వార్తకు స్పందన
- ఆర్‌టిసి బస్ స్టాండ్‌లో
డ్రైన్లు శుభ్రం చేయించిన కమిషనర్

పాలకొల్లు,మేజర్ న్యూస్: మురుగు ట్రైన్లు నిండిపోయి పూడికతీత లేక బస్టాండ్ ప్రాంతం రోడ్లపైకి, బస్టాండ్ లో మురుగనీరు నిలిచిపోవడంతో సూర్య పత్రికలో వచ్చిన కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ జెసిబి సహాయంతో మురుగు డ్రైన్లను శుభ్రం చేయించారు. దానిలో ఉన్న షెల్టును తొలగించే కార్యక్రమం శనివారం చేపట్టారు.

పం.గో.జిల్లా పరిషత్
సమావేశంలో శాఖల ప్రగతిపై సమీక్ష

ఏలూరు,మేజర్ న్యూస్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ ప్రణాళిక, విద్య, త్రాగునీరు, విద్యుత్, ఇరిగేషన్, శాఖల అభివృద్ధి అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో తమతమ శాఖల ప్రగతి నివేదికలపై వివరణ, సమీక్ష జరిగింది. సమావేశంలో జెడ్పి సిఇఓ కె.ఎస్.ఎస్. సుబ్బారావు, వివిధ శాఖల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణలో చదవటం మాకిష్టం కార్యక్రమం

నరసాపురం,మేజర్ న్యూస్ : ప్రథమ శ్రేణి శాఖ గ్రంధాలయం నందు నిర్వహించబడుతున్న వేసవిజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారంఏపీ సెర్ట్ వారు ప్రచురించిన "చదవడం –మాకిష్టం" ప్రోగ్రాంలో నీతి కథలు సింహము–ఎలుక, పరమానందయ్య శిష్యుల కథలు,కుక్క..మాంసపు ముక్క తదితర నీతి కథలును పిల్లలు కు వీడియో ద్వారా రిసోర్స్ పర్సన్ జీవన్ కుమార్ చూపించడం వినిపించడం జరిగింది. చిత్రలేఖనంఆర్టిస్టు తోట శ్రీనివాస్,కరాటే లో టి కృష్ణ శిక్షణ ఇచ్చినారు. అనంతరంపిల్లలకు రైమ్స్ పాటలు ఆటలు ఆడించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రంగినీడి సుబ్బారావు, జ్ఞాన ప్రకాష్,సుదీర్ మోహన్,సూర్యం బాబు,శ్రీనివాస్ మాస్టర్ , ప్రవీణ్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేసవి జ్ఞాన శిబిరంలో పుస్తక పఠనం

ఏలూరు,మేజర్ న్యూస్: ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం శనివారం రిసోర్స్ పర్సన్ డి.శ్రీవల్లి ప్రారంభించారు. అనంతరం పుస్తక పఠనం చేయించారు. రకరకాల ఆధ్యాత్మిక కథలు,జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, నీతి కథలు,చదివించారు. చదివిన పుస్తకాల ఆధారంగా రిసోర్స్ పర్సన్ క్విజ్ రూపంలో ప్రశ్నలు అడిగారు. విధ్యార్థులు ఎంతో ఉత్సాహంగా జవాబులు ఇచ్చారు. అనంతరం చిన్నారుల చేత యోగతో కూడిన సరదా గేమ్స్ ఆడించారు. నేనూ ఒక చెట్టును అనే అంశంపై చిన్నారుల చేత నాటక ప్రదర్శన లో శిక్షణ ఇచ్చారు.అనంతరం కె.శంకర్ డ్రాయింగ్ టీచర్,రిసోర్స్ పర్సన్ విద్యార్థులకు రకరకాల డ్రాయింగ్స్ వేసి వాటిలోని మెలుకువలు నేర్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జి.కల్యాణి,కె.మహీధర్,ఎమ్. క్రాంతి కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది శ వి .టి .సందీప్ కుమార్,ఎండీ. ఎ.అస్లాం పాషా, బి వి ఎస్. లక్ష్మీ,విధ్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఆటో డీ కొట్టడంతో వ్యక్తి మృతి

జీలుగుమిల్లి,మేజర్ న్యూస్బీ ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన జీలుగుమిల్లిలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. శనివారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం తెలంగాణ రాష్ట్రం అశ్వరావుపేట మండలం అనంతారం గ్రామానికి చెందిన దాసరి రాంబాబు(47) తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించే క్రమంలో అశ్వరావుపేట నుండి ఖమ్మం వెళుతుండగా సత్తుపల్లి సమీపంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య రాణికి కాలు విరిగింది.వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.ఆటోలో ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని తిరిగి వస్తుండగా జీలుగుమిల్లిలో ప్రమాదం జరిగింది.ఆటోలో ఆరుగురు ఉండగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని జీలుగుమిల్లి ఎస్సై వి చంద్రశేఖర్ పరిశీలించారు.

4న కౌంటింగ్ రోజు పోలీసుల ఆదేశాలు పాటించాలి

- కూటమి కార్యకర్తలకు జనసేన ఇంచార్జీ అప్పల నాయుడు

ఏలూరు,మేజర్న్యూస్: ఏలూరునియోజకవర్గప్రజలకు జనసేన, తెలుగుదేశం,బిజేపీ పార్టీల నాయకులకు,కార్యకర్తలకు వీర మహిళాలు ప్రతి ఒక్కరు ఈనెల 4వ తేదీ జరిగే కౌంటింగ్ సందర్భంగా ఎక్కడ ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఎలక్షన్ కమిషన్,పోలీసు యంత్రాంగం తీసుకునే చర్యలకు పూర్తిగాసహకరించాలనిరెడ్డి అప్పల నాయుడు కోరారు.రాబోయేది కూటమి ప్రభుత్వమే. అని, ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలందరికీ రక్షణగా ఉండాలని ,ముఖ్యంగా జనసేన నాయకులు అందరూ క్రమశిక్షణతో ఉండాలని కోరారు. గెలుపు ఓటములనేది 2 పార్టీల అభ్యర్థులకు సమంజసమైనది. ఒకరికి నచ్చిన నచ్చకపోయినా ఏ విధమైన అల్లర్లు సృష్టించరాదని,జూన్ 4వ తేదీన కౌంటింగ్ సందర్భంగా పోలీసులు విధించిన ఆంక్షలు ప్రకారం కార్యకర్తలు నడుచుకోవాలని రెడ్డి అప్పల నాయుడు తెలిపారు. గెలుపు అనంతరం విజయోత్సవ ర్యాలీలు గాని,బాణాసంచా కాల్చడం ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలప్రకారంవిరుద్ధమన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్,ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్, కోశాధికారి పైడి లక్ష్మణరావు ,కార్యద ర్శి ఎట్రించి ధర్మేంద్ర, మీడియా ఇంచార్జీ జనసేన రవి,చిత్రి శివ, నాయకులు నూకల సాయి, బోండా రాము నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్ ద్వారకాధీశుని ఆలయానికి ఉపాలయమైన ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం ఉదయం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని దేవాలయ సిబ్బంది ముందుగా ఆలయ పరిసరాలు శుభ్రపరిచి మామిడి తోరణాలు అరటి బోదెల విశేష సుగంధభరిత పూలమాలలు తో అలంకరణలు చేశారు.అనంతరం ఆలయ అర్చకులు గోపి స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి స్వామివారికి ప్రీతికరమైన తమలపాకులతో విశేష పూజలు జరిపారు.ఆలయ ఈవో వేంద్ర త్రినాథరావు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరామ రామ రమేతిరామ సహస్రనామ తత్తుల్యం రామ నామవరానమే నామాలతో పుజలు నిర్వహించుకుని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిర్వాసితుల సమస్యలపై ఉద్యమం

సీపీఐ ప్రజా పంథా

వేలేరుపాడు,మేజర్ న్యూస్ : అనేక ఏళ్లుగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను ఏఒక్క ప్రభుత్వం పట్టించుకోలేదని,ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ,భూసమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమిస్తామని ఆ పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్కే గౌస్ అన్నారు. శనివారం మండలం లోని కాచారం గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వర్గాల ప్రజలను విస్మరించి తీరనిఅన్యాయంచేశాయని ఆరోపించారు. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో ఆర్అండ్ఆర్, పునరావాసం కల్పించకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి ముఖ్యంగా ఆదివాసీలను ముంచే సారని విమర్శించారు.యువతకు కటాఫ్ డేట్అంక్ష ఎత్తివేసి,45.10 కాంటూరువరకు ఆర్అండ్ఆర్ప్యాకేజీ అందజేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కట్టం వీ రస్వామి,సీత,రాజులు, మున్నీ తది తరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన కరెంట్ స్తంబాలు

నర్సాపురంరూరల్,మేజర్ న్యూస్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం తెల్లవారుజాము నుండి ఈదురు గాలులు వీసాయి. తెల్లవారుతూ ఉండగా ఆకాశమంత చీకటి గమ్మి, చల్లటి వాతావరణం ఏర్పడ్డది. అక్కడక్కడ చిన్న చిన్న తుంపర్లు పడ్డాయి. పెద్ద ఎత్తున గాలులు రావడంతో పలు గ్రామాల్లో కొబ్బరి చెట్లు, కరెంటు స్తంభాలు, పూరి గుడిసెలు కూలిపోయాయి. గొంది గ్రామంలో కరెంటు స్తంభాలు, కొబ్బరి చెట్లు పడిపోవటంతో విద్యుత్ కు అంతరాయం ఏర్పడ్డది. అనేక గ్రామాల్లో ఈదురు గాలుల వల్ల కొన్ని గంటలపాటు విద్యుత్తుకు అంతరాయం ఏర్పడ్డాది. కరెంట్ స్తంభాలు విరిగిపడటంతో సంబంధిత శాఖ సిబ్బంది అప్రమత్తమై ఆ గ్రామంలో విద్యుత్తు నిలుపుదలచేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

వాసవిలో వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్: తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో శనివారం హనుమాన్ జన్మదినోత్సవం పురస్కరించుకుని ఆలయంలో వేంచేసి ఉన్న అభయాంజనేయ స్వామి వారికి ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు పంచామృతాలు సుగంధ ద్రవ్యాలు పండ్ల రసములతో అభిషేకాలు విశేష పూజలు చేసి తములపాకులు సింధూరంతో పూజలు చేయడం జరిగినది. అనంతరం 27 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహానికి విగ్రహ దాతలు దాతలు మాటూరి వెంకన్న దంపతులచే విశేష పూజలు చేసినారు. అనంతరం వారి దాతృత్వంతో సుమారు 500 మందికి అన్న ప్రసాద వితరణ జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు పూర్వాధ్యక్షులు వబిలిశెట్టి నటరాజ్, మండవల్లి నాగేంద్ర, శ్రీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొర్లెపర శ్రీరామచంద్రమూర్తి (రాము), సెక్రటరీ నున్న బాల త్రిపుర సుందర్రావు, ట్రెజరంగ్ భోగవల్లి రమేష్, ఆలయ సెక్రటరీ ఆలపాటి సత్యనారాయణ గ్రంథాలయ సెక్రటరీ కొత్త శివ, కార్యవర్గ సభ్యులు చొప్పర్ల శ్రీరామచంద్రమూర్తి, పులవర్తి మల్లికార్జున్, పెనుగొండ శ్రీనివాసు, గ్రంధివీర్రాజు ఉపాధ్యక్షులు కొండూరు రాము తదితరులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం 7 గంటల నుండి శ్రీ కోదండరామ భజన సమాజం వారిచే హనుమాన్ చాలీసా పారాయణం భజన కోలాటం చేయడం జరిగింది అనంతరం వచ్చిన భక్తులందరికీ భక్తులు అత్తిలి రామారావు, సమయ మంత్రి చంద్రశేఖర్ దంపతుల దాతృతంతో అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ్ సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు వాసవి వనిత క్లబ్ సభ్యులు అనేకమంది భక్తులు పాల్గొన్నారు.

వైఎస్ పాలెంలో

అభయాంజనేయ స్వామి జయంతి

నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్: మండలంలో యర్రంశెట్టి వారి పాలెంలో శ్రీకళ్యాణ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న అభయ ఆంజనేయ స్వామి వారి జయంతి ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగినఈ కార్యక్రమం సందర్భంగా స్వామివారికి పాలాభి అభిషేకములు, తమలపాకులతో అర్చనలు, సింధూరంతో స్వామివారికి పూజా కార్యక్రమంలు చేశారు. దంపతులు కూనపరెడ్డి ఏడుకొండలు,అది అంజమ్మ దంపతులు,కూనపు రెడ్డి ఏసుబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యర్రం శెట్టి నాగ ముత్యమాంబ,బాబు లు,ఆలయ ధర్మకర్త యర్రం శెట్టి వెంకట సూర్యనారాయణ, రాజా వెంకట నరసింహారావు, సాంబమూర్తి,యర్రంశెట్టి పాండురంగ ఆలయ పూజారి రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసర ప్రాంత గ్రామాల నుండి విశేషముగా భక్తులు వచ్చి శ్రీ అభయ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు.

ఏలూరు మండలంలో

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

ఏలూరు రూరల్,మేజర్ న్యూస్: ఏలూరు మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో వైభవంగా సాగుతున్నాయి. శ్రీరామ నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగుతు న్నాయి. ఉదయాన్నే హనుమాన్, రామాలయాలకు అధిక సంఖ్యలో పోటెత్తిన భక్తులు బజరంగబలికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఏలూరు మండలంలో మొండికోడులో 20అడుగుల ఆంజనేయుని నిలువెత్తు విగ్రహాన్ని దర్శించుకోవడానికి ఉదయాన్నే అధిక సంఖ్యలో భక్తులు పోటేత్తారు. లంక గ్రామాల నుంచి ప్రజలు తండపతండాలుగా తరలి వచ్చి బజరంగబలికి ప్రత్యేక పూజలు నిర్వ హిస్తున్నారు. ఏలూరు మండల పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసరాజు,సంతోషిమాత ఫీడ్స్, నీడ్స్ అధినేత శ్రీకాంత్ వర్మ, పెద్దింట్లమ్మ ఆక్వా అధినేత సంతోష్ వర్మ, సుధీర్ వర్మలు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. మధ్యాహ్నం మహా అన్న సమారాధన నిర్వహిం చారు. మాదేపల్లి, కోటేశ్వరదుర్గ పురం, ప్రత్తికొల్లాంక, పైడిచింతపాడు ఆంజనేయ స్వామి క్షేత్రాల వద్ద రామనామ జపంతో మారుమోగుతోంది. ఇక్కడ పురష్కరించుకుని వేకువజామునే ఆంజనేయుడికి తిరుమంజనం, ద్రావిడ ప్రబంధ పారాయణం, పంచామృత అభిషేకం, సహస్ర నాగవల్లి అర్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

30న ఏలూరులో రాష్ట్ర స్థాయి చర్మకారుల సదస్సు

ఏలూరు,మేజర్ న్యూస్: ఈనెల 30వ తేదీన ఏలూరు నగరంలో రాష్ట్ర స్థాయి చర్మకారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు,జాతీయ సీనియర్ దళిత నేత పొలిమేర హరికృష్ణ తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో హరికృష్ణ ముఖ్య నాయకులతో మాట్లాడుతూ చర్మకార్ల సంక్షేమ సంఘం స్థాపించి 30 వసంతాలు పూర్తి అయ్యాయని ఫిబ్రవరి, మార్చి నెలలో జరుపలని తలపెట్టిన ఈ సదస్సును ఎన్నికల కారణంగా జూన్ నెల ఆఖరిలో చేయదలచామన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో చర్మకారుల జీవనస్థితి గతులు అద్వానంగా ఉన్నాయని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్లేందుకు సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం తరపున చర్మాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, గతంలో ప్రభుత్వం తరపున చర్మాలు కొనుగోలు కేంద్రాలు ఉండేవని, గుర్తు చేశారు. లెదర్ ఇండస్ట్రీని పటిష్ట పరచాలని,ప్రత్యేకంగా చర్మకారుల, దప్పు కళాకారులు పిల్లలకు ఎంట్రన్స్ టెస్ట్ లేకుండా గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని, ప్రభుత్వ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, రోడ్డు ప్రక్కన చెప్పులు కుట్టే వారికి వ్యాపారం చేసుకునే వెసులుబాటును కలిపించాలని తదితర డిమాండ్‌ల సాధనకు ఈ సదస్సు ద్వారా తీర్మానించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో చర్మకార సంఘ నాయకులు బేవునపల్లి లక్ష్మణ్ జొన్నకూటి రవి, ముల్లుల రమేష్, పొలిమేర రాజు, కటారి రాజేష్, నాగేశ్వరరావు,బడుగు రామకృష్ణ, ఎర్ర సత్యానందం, కులసాల పోతురాజు, పొలిమేర దుర్గారావు పాల్గొన్నారు.

టెన్సింగ్ నార్గే జాతీయ

సాహస అవార్డుకు నామినేషన్లు

ఏలూరు,మేజర్ న్యూస్: భారత యువజన సర్వీసుల,క్రీడల మంత్రిత్వ శాఖ నుండి 2023 సంవత్సరమునకు టెన్సింగ్ నార్గే జాతీయ సాహస అవార్డు (టిఎన్ఎన్ఎఎ) కొరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నామని యువజన సర్వీసుల శాఖ.సెట్‌వెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి యం.డి.హెచ్.మెహరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డు కొరకు నాలుగు కేటగిరీ లలో అనగా భూమిపై, నీటిపై (నావికాసంబందమైన),వాయు విన్యాస సంబంధమైన సాహసాలలో అత్యుత్తమ విజయము సాదించినవారి నుండి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. సాహస క్రీడలలో అంకిత భావముతో నైపుణ్యాన్ని ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యము కింద అవార్డును బహూకరిస్తారన్నారు. ఈ అవార్డు టెన్సింగ్ నార్గే ప్రతిమ,ధృవపత్రము,బ్లేజర్,శారీ రూ.15 లక్షల నగదు బహూకరిస్తారని,ఒకే కేటగిరికి సంబందించి ఒకే వ్యక్తికి రెండవ పర్యాయము ఈ అవార్డు ఇవ్వరన్నారు. ఈ అవార్డు అర్జున అవార్డుకు సమానముగా ఉంటుందని,విజయము సాదించిన వారికి అర్జున అవార్డు ఇచ్చే సమయము లోనే భారతప్రభుత్వముచే బహుకరించబడుతుందన్నారు. ఈ అవార్డు కొరకు ఈనెల 16వ తేదీ లోగా http://awards.gov.in పోర్టల్ ద్వారా ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరముల కొరకు సెట్‌వెల్ ఏలూరు వారి నెం: 08812231866,9490938012 లను సంప్రతించాలని మెహర్రాజ్ తెలియజేసారు.

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం చేసే కుట్రలను అడ్డుకుందాం

ఏలూరు రూరల్,మేజర్ న్యూస్: ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వ పెద్దల కుట్రలను అడ్డుకుందాం అని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు దశలవారీగా ఆంక్షలు పెడుతూ గ్రామీణ కూలీలకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ రవి విమర్శించారు. శనివారం ఉదయం మాదేపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలను ఏ రవి, జే గోపి పని ప్రదేశంలో కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు తగ్గిస్తూ ఆంక్షలు పెంచడం ద్వారా గ్రామీణ పేదలకు అన్యాయం చేస్తుందని అన్నారు. ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం 400కు పెంచాలని పని దినాలను 200 రోజులు కల్పించాలని గ్రామీణ పేదలతో పాటు పట్టణ పేదలకు కూడా ఈ పథకాన్ని వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు నగరం పరిసర ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు అడుగంటి పోయాయని పట్టణ ప్రాంత పేదలకు ఉపాధి హామీ పథకాన్ని వర్తింపజేయాలని జే గోపి డిమాండ్ చేశారు.

ధన్యుడైన చొప్పల సాయిబాబా

ఈపీడీసీఎల్ జేఏవోగా పదవీ విరమణ

ఏలూరు,మేజర్ న్యూస్: ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ ఆఫీసులో శుక్రవారం రాత్రి చొప్పల సాయిబాబా పదవీ విరమణ కార్యక్రమం ఈపీడీసీఎల్ ఉద్యోగస్తు లు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు ప్రజా సంఘాలను ఆహ్వానించారు. భారతీయ బౌద్ధ మహాసభ తరపున బేతాళ సుదర్శనం,బేతాళ నాగరాజు,ఏ నాగార్జున,డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, మేతర అజయ్ బాబు తదితరులు సాయిబాబా సేవలను కొనియాడుతూ సన్మానించారు. ఈపీడీసీఎల్‌లో ఎస్సీ,ఎస్టీ అసోసియేషన్ అంటేనే చొప్పల సాయిబాబా అని,కొంతమంది ఎస్సీ ఎస్టీ ఉద్యోగస్తులే ఎలక్షన్లలో వారిని ఓడించటానికి ప్రయత్నం చేసినప్పటికీ ఈపీడీసీఎల్ రాష్ట్ర కార్యదర్శిగా విజయం సాధించి నిరంతరం పనిచేశారని వక్తలు కొనియాడారు. ఎందరో ఉన్నత ఉద్యోగుల సస్పెన్షన్, ట్రాన్స్ఫర్స్, ఉద్యోగ,కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో సాయిబాబా కృషి అమోఘమైనదన్నారు. ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ను గౌరవంగా డిపార్ట్మెంట్లో ఉంచడానికి తన ఉద్యోగ జీవితాన్ని త్యాగం చేశారు. దేవుళ్ళపైన విశ్వాసం లేని విధంగా తన పిల్లలను పెంచారు. తన గ్రామంలోని పాఠశాలకు బుద్ధుడు, సావిత్రిబాయి, అంబేద్కర్ విగ్రహాలతో పాటు ఒక ప్రాంగణాన్ని నిర్మించారు. ఏ సమాజం నుంచి అయితే వచ్చారో ఆ సమాజానికి తగినంత సేవా చేయగలిగారని పలువురు పేర్కొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

ఏలూరు,మేజర్ న్యూస్: స్థానిక పల్లపు వీధిలో ఉన్న ఆంజనేయ స్వామి గుడివద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు,మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.అన్నసమారాధన కార్యక్రమంలో 1000 మందికి పైగా భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. అతి వైభవంగా జరిగిన హనుమాన్ జయంతి ఉత్సవాల్లో కాపుసంక్షేమ సేవాసంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీరాములు,అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు వాసా రాజు,ఎఎంసి మాజీ ఛైర్మన్ పూజారి నిరంజన్ ప్రముఖ సివిల్ ఇంజనీరు మోటేపల్లి చంద్రశేఖర్,మాజీ కార్పోరేటర్ కాపా రఘు,కాపుసంక్షేమ సంఘ స్టీరింగ్ కమిటీ సభ్యులు నడపన దాన భాస్కర్ ,బడే సతీష్ నాయుడు, విఠాల శేషగిరి,కూనిశెట్టి మురళీకృష్ణ, మంచెం వెంకటేశ్వర రావు,సవిరే రాజేష్ నాయుడు,తూతా హరి నాగరాజు,గుద్దటి రమేష్ ,దండిపాటి జగన్మోహనరావు కాకర్ల శ్రీనివాస్ పాలేటి భాస్కర రావు,ప్రగడ రామకృష్ణ ,ఉప్పు శ్రీనివాస్,కాపా పాండు తదితరులు పాల్గొన్నారు

పోలింగ్ ఏజెంట్లకు,కౌంటింగ్ సిబ్బందికి సెల్ ఫోన్ల అనుమతి లేదు

ఏలూరు,మేజర్ న్యూస్: ఓట్ల లెక్కింపు రోజు 4వ తేదీన పోలింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది కౌంటింగ్ హాలుకు సెల్ ఫోన్లు ,ఇతర ఎలక్ట్రానిక్ పరికరములు కౌంటింగ్ కేంద్రానికి తీసుకురావడానికి అనుమతి లేదని జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి తెలిపారు. శనివారం ఏలూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో దెందులూరు అసెంబ్లీకి పోటీచేసిన ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులకుచవారి ఛీఫ్ ఏజెంట్లకు జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ ఉదయం 7 గంటల లోపు గుర్తింపు కార్డులతో వారికి కేటాయించిన మార్గం ద్వారా హాజరుఅవ్వాలని తెలిపారు. కౌంటింగ్ రోజు 144 సిఆర్ పి.సి.సెక్షన్ అమల్లో ఉన్నందున ఏవిధమైన ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదని,బాణాసంచా కాల్పులు నిషేధమని తెలిపారు. మద్యం విక్రయం నిషేధమని తెలిపారు. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 6.00 గంటలకు గుర్తింపు కార్డులతో హాజరు కావల్సిందగా తెలిపారు. ఈ సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారు,తహశీల్దార్లు, దెందులూరు,పెదపాడు,పెదవేగి సహాయ రిటర్నింగ్ అధికారులు,మండల పరిషత్ అభివృద్ధి అధికారులుపాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ

ఏలూరు,మేజర్ న్యూస్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్చార్జి కార్యదర్శి,అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.కె.వి.బులి కృష్ణ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనమనందు ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ అంశం పైన వివిధ అధికారులతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఇన్చార్జి కార్యదర్శి,అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.కె.వి బులి కృష్ణ అతిథిలకు ఆహ్వానం పలికారు.అదనపు మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య మాట్లాడుతూ నగర ప్రజలను ఎప్పటికప్పుడు అవగాహన కలిగిస్తూ అందుబాటులను వనరులను ఉపయోగించుకుంటూ వ్యర్థ పదార్థాలను సేకరించి, వాటిని పునరుత్పత్తి చేయడం జరుగుతుందని. రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వర రావు,డిఎంహెచ్ఓ డిప్యూటీ డెమో నాగరత్నం,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్ కూనా కృష్ణారావు ప్రసంగించారు. అనంతరం ఏపీ పొల్యూషన్ బోర్డు వారు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేయడం జరిగింది.